క్లుప్తంగా

టీడీపీ దాడిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తకు గాయాలు



టీడీపీ వర్గం దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త సుధాకర్

పొన్నలూరు: టీడీపీ కార్యకర్తల అత్యుత్సాహం ఘర్షణకు దారితీసింది. ఈ ఘటన సోమవారం మండల పరిధిలోని వేంపాడులో జరిగింది. ఓ వృద్ధురాలి ఓటును టీడీపీ కార్యకర్త ఆమెకు బదులు వేశాడు. ఇది గమనించిన వైఎస్సార్ సీపీ కార్యకర్త యర్రా సుధాకర్ అడ్డు చెప్పడంతో టీడీపీ వర్గం రెచ్చిపోయింది. ఈ క్రమంలో వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. దీంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తకు రక్త గాయాలయ్యాయి.

రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు

- వైఎస్సార్ సీపీ కార్యకర్తకు గాయాలు



కారుమంచిలో ఘర్షణ పడుతున్న టీడీపీ- వైఎస్సార్ సీపీ కార్యకర్తలు



గాయపడిన అంకమ్మరావు

టంగుటూరు: ఎన్నికల వేళ టీడీపీ కార్యకర్తల ఆగడాలు తీవ్రమయ్యాయి. కొండపి నియోజకవర్గ వ్యాప్తంగా పలు చోట్ల జరిగిన ఘర్షణల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నేతలకు గాయాలయ్యాయి. మండలంలోని కారుమంచి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 179, 180 బూత్‌ల వద్ద వారి ఆగడాలు ఎక్కువయ్యాయి. టీడీపీ ఏజెంట్‌గా ఉన్న మేడికొండ భాను, నాయకులు నరేష్, దగ్గుమాటి పృథ్వీరాజ్, వల్లూరి రాజు తదితరులు ఓటర్లను ప్రలోభ పెట్టే యత్నం చేశారు. బూత్ వద్దకు వెళ్లి టీడీపీకి ఓట్లు వేయాలని ప్రచారం చేస్తున్నారు. దీంతో అక్కడే ఉన్న వైఎస్సార్ సీపీ నేతలు అడ్డుకోవడంతో టీడీపీ నేతలు దాడి చేశారు. దీంతో మన్నం అంకమ్మరావు రెండు పళ్లు రాలాయి. అలాగే అతని నోటిపై గాయాలయ్యాయి. అంతటితో ఆగకుండా తీవ్రమైన పదజాలంతో విరుచుకు పడ్డారు.

ఓటెత్తిన ప్రజాస్వామ్యం

- కొండపి నియోజకవర్గంలో ముగిసిన పోలింగ్
- ఘర్షణలు, చెదురు మదురు ఘటనల మధ్య తరలిన ఓటర్లు
- ఉదయం 7 గంటల నుంచే పెరిగిన క్యూ లైన్లు
- టీడీపీ కార్యకర్తలు, నేతల కవ్వింపు చర్యలు

సాక్షి నెట్ వర్క్: సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు వినియోగించుకొనేందుకు సోమవారం ఓటర్లు పోటెత్తారు. కొండపి నియోజవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఉదయం 7 గంటల నుంచే బారులు తీరారు. మధ్యాహ్నం కాస్త పోలింగ్ శాతం నెమ్మదించినప్పటికీ 3 గంటల తర్వాత భారీగా ఓటింగ్ శాతం నమోదైంది. సాయంత్రం ఆరు దాటినా అదే జోరు కనిపించింది. అయితే ఈ దఫా ఎన్నికల్లో కొన్ని పార్టీలు ఘర్షణలకు దిగాయి. ముఖ్యంగా టీడీపీ వర్గీయులు ప్రత్యర్థి వర్గం అయిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. అయినా ఓటర్లు ఆత్మస్థైర్యం కోల్పోకుండా సాయంత్రం వరకు తమ ఓటును ఈవీఎం బటన్లపై నొక్కి వెళ్లారు.

సహనం కోల్పోయిన టీడీపీ

టంగుటూరు మండలంలోని కారుమంచి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 179, 180 బూత్‌ల వద్ద వారి వైఎస్సార్ సీపీ కార్యకర్తపై టీడీపీ వర్గీయులు దాడి చేయడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఇక వల్లూరులో అయితే ఏకంగా టీడీపీ అభ్యర్థి స్వామి తన అనుచరులతో నేరుగా పోలింగ్ బూత్‌లోకి వెళ్లి హడావిడి చేశారు. కొండపి మండలంలోని కోయవారిపాలెం గ్రామంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో కొంత సేపు పోలింగ్ నిలిచిపోయింది. అధికారుల చొరవతో తిరిగి ప్రారంభమైంది. పొన్నలూరు మండల పరిధిలోని వేంపాడులో వైఎస్సార్ సీపీ కార్యకర్తను టీడీపీ నేతలు తీవ్రంగా గాయపరిచారు.

బారులు తీరిన ఓటర్లు

సింగరాయకొండ, టంగుటూరు, కొండపి, పొన్నలూరు, జరుగుమల్లి, మర్రిపూడి మండలాల్లో ఓటర్లు భారీగా తరలి వచ్చారు. మర్రిపూడి మండలంలోని కూచిపూడి పోలింగ్ బూత్ వద్ద పోలింగ్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఓటు వేయడానికి ఆలస్యం అయింది. అలాగే ఓటర్లు నీడ కోసం సరిపడినన్ని టెంట్‌లు ఏర్పాటు చేయకపోవడంతో ఎండలో ఓటర్లు గంటలపాటు నిలిచిపోయారు. దాదాపు అన్ని కేంద్రాల్లో సాయంత్రం అయినా ఓటర్ల సంఖ్య తగ్గలేదు.

ఓటర్ల ఆందోళన

కొండపి మండలం ఉప్పలపాడులో బూత్ నంబర్ 159లో ఓటర్లు ఆందోళనకు దిగారు. ఒక్కో ఓటుకి అరగంట టైమ్ తీసుకుంటుండటంతో అధికారుల తీరుపై ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. సాయంత్రం ఐదు గంటలకు సమయంలో దాదాపు వెయ్యి మంది ఓటర్లు మిగిలిపోవడంతో వారంతా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.

మొరాయించిన ఈవీఎంలు

సింగరాయకొండ మండలం శానంపూడి పంచాయతీ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 236 బూత్‌లో అస్లెంబ్లీ ఈవీఎం గంట సేపు, పార్లమెంట్ ఈవీఎం గంటన్నర సేపు ఆగాయి. దీంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. తరువాత వాటిని మార్చడంతో సమస్య పరిష్కారం అయింది. అలాగే సోమరాజు పల్లి పంచాయతీ ప్రాథమిక పాఠశాలలో 245 పోలింగ్ బూత్ ఈవీఎం గంట సేపు పనిచేయలేదు. తర్వాత మరమ్మతులు చేయడంతో అనంతరం పోలింగ్ మందకొడిగా సాగింది.



టంగుటూరు మండలంలోని కొణిజేడులో ఓటర్ల కోలాహలం



కూచిపూడి పోలింగ్ బూత్ వద్ద పోలింగ్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిన ఓటర్లు



శానంపూడి ఎస్సీ కాలనీలో సాయంత్రం 5.40 గంటలకు బారులు తీరిన జనం



పాకల పంచాయతీ కార్యాలయంలో అభివాదం చేస్తున్న మంత్రి సురేష్



సింగరాయకొండ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి వెళ్తున్న మంత్రి సురేష్



కూచిపూడిలో వృద్ధురాలికి సాయం చేస్తున్న కానిస్టేబుల్



మర్రిపూడి మండలం కూచిపూడిలో వృద్ధులకు సాయం చేస్తున్న బంధువులు



మూలగుంటపాడు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో వృద్ధురాలిని తీసుకొని వస్తున్న కొడవలి మణి, వార్డ్ మెంబర్ షేక్ సుభాని



కొండపిలో మండలంలో ఓటు వేసేందుకు ఆటోలో వచ్చిన వృద్ధురాలు

టీడీపీ మూకల ఆగడాలు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టీడీపీ మూకలు హల్‌చల్ చేశాయి. వల్లూరు, జమ్ములపాలెం, కాకుటూరివారిపాలెం, టంగుటూరు, తూర్పునాయుడుపాలెం, పొందూరు గ్రామాల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలు రెచ్చిపోయారు. పోలింగ్ బూత్‌ల వద్దకు చేరుకుని టీడీపీకి ఓటు వేయాలని భయభ్రాంతులకు గురిచేశారు. ప్రతిఘటించిన వైఎస్సార్ సీపీ నాయకులపై దౌర్జన్యానికి దిగారు. పోలీసుల చొరవతో గొడవలు సద్దుమణిగాయి.



కొండపిలో 3 గంటలకు కూడా క్యూలైన్‌లో వేచి ఉన్న ఓటర్లు



కొండపి మండలం కేజీ కండ్రికలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు



కొండపి మండలం మల్లవరప్పాడులో 3.16 సమయంలో తగ్గని లైన్



టంగుటూరు: మండలంలో మహిళా ఓటర్ల ప్రభంజనం



జరుగుమల్లి: నర్సింగోలులో టీడీపీ కార్యకర్తలను చెదరగొడుతున్న పోలీసులు



సోమరాజు పల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న జెడ్పీవైస్ చైర్మన్ అరుణ



మూలగుంటపాడు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో..



పొన్నలూరు బూత్ నంబర్ 59లో బారులు తీరిన ఓటర్లు



సింగరాయకొండ బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం 7:20 గంటలకు బారులు తీరిన జనం



టంగుటూరు మండలం వల్లూరు జిల్లా పరిషత్ పాఠశాలలో పోటెత్తిన ఓటర్లు

కనిగిరి: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం ఉదయం 7 గంటల నుంచే నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరి కనిపించారు. మండుటెండల నేపథ్యంలో ఉదయాన్నే ఓటు వేసేందుకు అందరూ మొగ్గు చూపారు. దీంతో పోలింగ్ కేంద్రాలు కిటకిటలాడాయి. కనిగిరితో పాటు కొన్ని గ్రామాల్లో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ సాగింది.

హనుమంతునిపాడు: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 28 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు 80 శాతం ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరి కనిపించారు. మండలంలోని కూటాగుండ్ల, సీతారాపురం, హనుమంతునిపాడు, వేములపాడు, మహ్మదాపురం గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు పోలింగ్ కొంత మందకొడిగా సాగింది. తరువాత పోలింగ్ పుంజుకుఉంది. మధ్యలో విద్యుత్ అంతరాయంతో పోలింగ్ అధికారులు ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ మండలంలోని హనుమంతునిపాడు, హాజీపురం పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓట్ల సరళి గురించి అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం 6 గంటల తరువాత కూడా పోలింగ్ కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఓటర్లు క్యూలైన్లలో కనిపించారు. రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి సీతారాపురంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు.

పీసీపల్లి: మండలంలో చెదురుమదురు ఘటనల మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 39 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. మండలంలోని కొత్త ముద్దపాడు పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. నేరేడుపల్లిలో టీడీపీ నాయకులు దొంగ ఓట్లు వేయిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు బోడె శివ, సంగటి పెద్దిరెడ్డి, బాలనర్సారెడ్డి , కోటిరెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై టీడీపీ నాయకులు పల్లా మల్లికార్జున, చాగంరెడ్డి కొండారెడ్డి, మాలపాటి ప్రసన్న కుమార్, ముప్పూరి రవి, చీమలదిన్నె మాలకొండయ్య దాడి చేశారు. మండల పరిధిలోని కోదండరామపురం, పీసీపల్లి, పెదయిర్లపాడు బూత్‌లలోని వైఎస్సార్ సీపీ అభ్యర్థి దద్దాల నారాయణ పోలింగ్ తీరును పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరి కనిపించారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలో చిన్న చిన్న చెదురుమదురు ఘటనలు మినహా మిగిలిన ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటకు పోలింగ్ ప్రారంభం కావాల్సి ఉండగా కొన్ని ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఆలస్యంగా ప్రారంభించారు. సీఎస్‌పురంలోని ఓ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికి ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ నిలిచిపోయింది. ఆ ఈవీఎం స్థానంలో మరోదాన్ని ఉంచి పోలింగ్ కొనసాగించారు. మరికొన్ని ప్రాంతాల్లో ఈవీఎంలు సైతం ఇబ్బంది పెట్టగా సరిచేసి పోలింగ్ కొనసాగించారు.

ఓటెత్తారు..!

- స్వల్ప ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం
- ఈవీఎంలు మొరాయించడంతో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభం
- ఉదయం 7 గంటలకే బారులుతీరిన ఓటర్లు
- సీఎస్‌పురంలో వైఎస్సార్ సీపీ నాయకుడిపై దాడి
- కొన్ని కేంద్రాల్లో రాత్రి 9 గంటల వరకు పోలింగ్
- వర్షంతో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఇక్కట్లు

వర్షంతో అంతరాయం

ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో అకాలంగా కురిసిన భారీవర్షం పోలింగ్ బూత్‌లవద్ద ఓటర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. మధ్యాహ్నం 4 గంటల నుంచి ప్రారంభమైన వర్షం సుమారు 1.45 గంటలపాటు కురిసింది. దీంతో ఓటర్లు ఇక్కట్లకు గురయ్యారు. కేంద్రాలవద్ద వేసిన టెంట్లు గాలికి ఎగిరిపోయాయి. కొన్ని కేంద్రాల్లో విద్యుత్ అంతరాయంతో కేంద్రాల్లో చీకటి నెలకొంది. రాత్రి 8 గంటల తరువాత కూడా మండలంలోని చెన్నపునాయునిపల్లి, ఉప్పలపాడు కేంద్రాల్లో పోలింగ్ కొనసాగింది. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ షేక్. నాగూర్‌మీరా పర్యవేక్షించగా, కేంద్రాలవద్ద భద్రతను ఎస్సై బి.ప్రేమ్‌కుమార్ పర్యవేక్షించారు.

పామూరు: మండలంలోని వీరభద్రాపురం, చిలంకూరు, గోపాలపురం, కరోళ్లపాడు గ్రామాల్లో జరిగిన తోపులాటలు, దూషణలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పామూరులోని 247 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించగా వేరే ఈవీఎం ఏర్పాటుచేసి పోలింగ్ కొనసాగించారు. కాగా రాత్రి 8 గంటల తరువాత రేణిమడుగుతోపాటు మరో పోలింగ్ కేంద్రంలో పోలింగ్ జరిగింది.

అకాల వర్షంతో ఇబ్బందులు

ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో అకాలంగా కురిసిన భారీవర్షం పోలింగ్ బూత్‌లవద్ద ఓటర్లకు నరకం చూపించింది. మండలంలో మధ్యాహ్నం 4 గంటల నుంచి ప్రారంభమైన వర్షం సుమారు 2 గంటల పాటు కురియగా ఓటర్లు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. పోలింగ్ కేంద్రాల వద్ద వేసిన టెంట్లు గాలికి ఎగిరిపోగా ఓటర్లు తడిసిపోయారు. మండలంలోని నుచ్చుపొదలో టెంట్‌గాలికి పడిపోగా తృటిలో ప్రమాదం తప్పింది. కాగా విద్యుత్ అంతరాయంతో కేంద్రాల్లో చీకటి నెలకొనగా నుచ్చుపొదలో పోలింగ్ కేంద్రం సిబ్బంది పోలింగ్‌ను ఆలస్యం చేయడంతో ఓటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ షేక్.షాకీర్‌పాషా తనిఖీచేసి పర్యవేక్షించగా శాంతి భద్రతలను సీఐ ఎం.రామానాయక్, ఎస్సై ఎం సైదుబాబు భద్రతను పర్యవేక్షించారు.

వెలిగండ్ల: మండలంలో స్వల్ప చెదురుమదురు ఘటనలు తప్ప ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగలేదు. సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలైంది. మండలంలోని పాపిరెడ్డిపల్లి పోలింగ్ కేంద్రం (44)లో 3 గంటల పాటు ఈవీఎంలు మొరాయించాయి. 10 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. గన్నవరం పోలింగ్ కేంద్రంలో 2 గంటల పాటు ఈవీఎంలు మొరాయించాయి. కంకణంపాడు, మొగళ్లూరు, తమ్మినేనిపల్లి పోలింగ్ కేంద్రంలో అర్ధగంట పాటు ఈవీఎంలు మొరాయించాయి. దీంతో పోలింగ్‌కు కొంత ఆలస్యం జరిగింది. సాయంత్రం 6 గంటల తర్వాత కంకణంపాడు, పాపిరెడ్డిపల్లి, గుడిపాటిపల్లి, పి.రాళ్లపల్లి, కొట్బాలపల్లి గ్రామాల్లో పోలింగ్ జరుగుతూ ఉంది. పాపిరెడ్డిపల్లి, కంకణంపాడు పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులకు ఓటు వేయించే క్రమంలో ఏజెంట్ల మధ్య వివాదం జరిగింది. పోలీసులు వచ్చి పోలింగ్‌కు అంతరాయం లేకుండా చేశారు.



పామూరులో క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు



ఓటుహక్కు వినియోగించుకున్న చింతలచెరువు



సీఎస్‌పురంలో ఈవీయం మొరాయించడంతో బయట కూర్చున్న ఓటర్లు



నుచ్చుపొదలో టెంటుకింద తడుస్తున్న ఓటర్లు



నుచ్చుపొదలో పడిపోయిన టెంట్



పాపిరెడ్డిపల్లిలో మొరాయించిన ఈవీఎంలు



కంకణంపాడులో రాత్రి 7-20 సమయంలో,..



వెంగళాయపల్లిలో రాత్రి 8.30 గంటలకు..



కూటాగుండ్లలో బారులుదీరిన ఓటర్లు

టీడీపీ నేతల దౌర్జన్యం



వైఎస్సార్ సీపీ నాయకులపై దాడి చేస్తున్న టీడీపీ నాయకులు

సీఎస్‌పురం(పామూరు): పోలింగ్‌బూత్‌లలో అక్రమాలను ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ నాయకులపై టీడీపీ నాయకులు దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం సీఎస్‌పురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 84వ పోలింగ్ కేంద్రం వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే..84వ పోలింగ్‌బూత్‌లో వైఎస్సార్ సీపీకి చెందిన ఏజెంట్లను టీడీపీ ఏజెంట్లు ఇబ్బందులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిసి తాము 84వ పోలింగ్ బూత్‌వద్దకు వెళ్లగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు తమపై దాడిచేసి గాయపరిచారని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. ఘటనలో వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు మేకల చిన తిరుపతిపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేయగా స్వల్పంగా గాయపడ్డారు. ఎస్సై బి.ప్రేమ్‌కుమార్‌ను వివరణ కోరగా ఫిర్యాదు రాలేదన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు



వైఎస్సార్ సీపీ నాయకులపై దాడి చేస్తున్న టీడీపీ నాయకులు

పామూరు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులపై టీడీపీ నేతలు దాడులకు పాల్పడ్డారు. మండలంలోని వీరభద్రాపురం పోలింగ్ బూత్‌ను చీఫ్ ఏజెంట్‌గా ఉన్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లూరి రామిరెడ్డి సందర్శించారు. ఈసందర్భంలో పోలింగ్‌బూత్‌లో ఉన్న టీడీపీ నాయకులు చీఫ్ ఏజెంట్‌ను తీవ్ర పరుష పదజాలంతో దూషిస్తూ మా పోలింగ్ బూత్‌లలో నీకు ఏం పని అని దూషిస్తూ, బయటకు నెట్టివేశారని రామిరెడ్డి తెలిపారు. అదే విధంగా చిలంకూరు గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ సందర్శించారు. ఈసందర్భంలో బయటకు వచ్చి వాహనం దగ్గరకు వచ్చిన ఆయనతో పాటు పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, కల్లూరి రామిరెడ్డి, అంబటి కొండారెడ్డిలను టీడీపీ నాయకులు దూషిస్తూ తోపులాటకు దిగారు. కరోళ్లపాడులో వైఎస్సార్ సీపీ నాయకులను టీడీపీ నాయకులు దూషించి తోసివేశారు. గోపాలపురంలో ఉపసర్పంచ్, వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల సాయికిరణ్‌తోపాటు మరో వ్యక్తిపై టీడీపీ నాయకులు దాడిచేసి గాయపరిచారు.



నేరేడుపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులపై దాడి చేస్తున్న టీడీపీ నాయకులు



పాపిరెడ్డిపల్లిలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



సీఎస్‌పురం మండలం అరివేములలో క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు